క్లుప్తంగా

నిత్య ధ్యానంతో రోగాలు దూరం



అవగాహన కల్పిస్తున్న ప్రచారకర్త నవీన్

యాలాల: నిత్య ధ్యానంతో రోగాలు దూరమవుతాయని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి, నవీన్ అన్నారు. సోమవారం మండల పరిధి రాస్నం గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వయోజనులతో మాట్లాడారు. అనేక సమస్యలు, ఒత్తిళ్లకు ధ్యానం ఒక్కటే పరిష్కార మార్గమని సూచించారు. ధ్యానం చేయడం వలన విశ్వశక్తి ప్రసారం జరిగి, నాడీ మండల శుద్ధి జరిగి, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ధ్యానం వలన విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందని తెలిపారు. సంస్థ సభ్యులు గోపాల్‌రెడ్డి, చెన్నయ్య, శ్రీనివాస్, యాదయ్య, బాబు ఉన్నారు.

మనసుకు ప్రశాంతత

ధారూరు: నిత్య ధ్యానంతో మనసుకు ఎంతో ప్రశాంతత లభిస్తుందని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి, నవీన్‌లు అన్నారు. స్టేషన్‌ధారూరు, కుమ్మరిపల్లి, అంపల్లి, గురుదోట్ల గ్రామాల్లో ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ధ్యానం మీద ధ్యాసపెడితే మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, వాతం తగ్గుతందని తెలిపారు. ధ్యానంలో విశ్వశక్తి ప్రసారం జరిగి, నాడీ మండల శుద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. కాల్షియం లోపించడం వలన మోకాళ్ల నొప్పి వస్తుందని, వీటి నివారణకు ధ్యానం ఒక్కటే ఔషధమన్నారు. సంస్థ సభ్యులు గోపాల్‌రెడ్డి, చెన్నయ్య, యాదయ్య, శ్రీనివాస్, బాబు ఉన్నారు. తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి బీజేపీ శ్రేణుల సన్మానం



ఎస్‌ఐని సన్మానిస్తున్న నాయకులు

కుల్కచర్ల: నూతన ఎస్‌ఐ అన్వేష్ రెడ్డిని బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోలీసు చట్టాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఆంజనేయులు, పార్టీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్ ఎస్‌ఐని కోరారు. ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మాజీ సర్పంచ్ జానకీరాం, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్, నాయకులు మైపాల్, రాంచంద్రయ్య, శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు టీకా ఇప్పించాలి

దోమ: వ్యాధుల నుంచి పశుసంపదను రక్షించుకోవాలని వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ టి. స్వప్న రైతులకు సూచించారు. సోమవారం మండల పరిధి బొంపల్లి పశువైద్యశాలలో గొర్రెలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గొర్రెలకు అమ్మతల్లి లేదా షీప్ పాక్స్ అనే వ్యాధులు సోకుతున్నాయన్నారు. ఈ వ్యాధి సోకిన గొర్రెలకు 106 డిగ్రీల నుంచి 108 డిగ్రీల వరకు జ్వరం వస్తుందని, దీంతో అవి మేత మేయవని చెప్పారు. పెదవులు, తల వాయడంతో పాటు, చెంపలు, తొడలు, పొదుగు, తొడ కింది భాగం, జననేంద్రియాలు, చెవులపై గుండ్రని ఎర్రటి పురుగులు ఏర్పడతాయని పేర్కొన్నారు. క్రమంగా పేగులకు బొబ్బలు వ్యాపించి దగ్గుతూ పడుకుంటాయన్నారు. దీంతో గొర్రెలు మృతి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. వీటి నుంచి జీవాలను రక్షించుకునేందుకు టీకాలు తప్పనిసరిగా ఇప్పించాలని తెలిపారు. ఇందులో కంపౌండర్ బాబయ్య, గొర్లకాపరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దేముల్: రుక్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అదే విధంగా గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ ప్రదీప్‌రావు యూపీఎస్ పాఠశాలకు రూ.15వేలతో బెంచీలు అందజేశారు. ఈ కార్యక్రమానికి మొల్ల కళావేదిక ఫౌండర్, కవయిత్రి కేవీఎం వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి 20 ఏళ్లుగా కృషి చేస్తున్నారని తెలిపారు. తాండూరు నియోజకవర్గంలో రోటరీ క్లబ్ సికింద్రాబాద్ వెస్ట్ వారి సౌజన్యంతో 600ల బెంచీలు అందజేసినట్లు పేర్కొన్నారు. అనంతరం దాతను పాఠశాల సిబ్బంది సన్మానించారు. హెచ్ఎం భాగ్యలక్ష్మి, విశ్రాంత వీఆర్‌ఓ మనోహర్‌రావు, మంబాపూర్ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం వీరప్ప, విద్యాకమిటీ చైర్మన్ రాములు, ఉపాధ్యాయులు శివకుమార్, రమేష్, పుష్పలత, వసంత, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, శిక్షణ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ ఉన్నారు.



వికారాబాద్: ఉత్సవర్యాలీలో స్పీకర్ ప్రసాదకుమార్ తదితరులు



పరిగి: శోభాయాత్రలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు



వికారాబాద్: ఉత్సవర్యాలీలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

వీరత్వానికి ప్రతీక ఛత్రపతి

- యువతరానికి స్ఫూర్తి ప్రదాత
- భావితరాలకు మహనీయుల చరిత్ర తెలపాలి
- శివాజీ జయంతిలో వక్తలు

యాలాల: భావి తరాలకు మహనీయుల చరిత్ర తెలియజేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా సోమవారం మండల పరిధి అక్కంపల్లి, చెన్నారం, అన్నసాగర్ గ్రామాల్లో శివాజీ విగ్రహాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కులమతాలకు అతీతంగా, నిస్వార్థంగా సేవలందించిన మహనీయుడు శివాజీ మహారాజ్ అని కొనియాడారు. ఆయన పాలన, విధానాలు, వ్యక్తిత్వాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్, ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మాజీ సభ్యుడు శివకుమార్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనారాయణ, సాయిలు, మధుసూదన్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మెట్లి ఆశన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



తాండూరులో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

లక్ష్య సాధనకు ఆదర్శం

దోమ: వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ అని, లక్ష్య సాధనకు శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీటీసీ రాములు సూచించారు. మండల పరిధి బొంపల్లి, మోత్కూర్, శివారెడ్డిపల్లి, బాస్‌పల్లి, దొంగ ఎన్కేపల్లి, దాదాపూర్, గుండాల తదితర గ్రామాల్లో శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడారు. ఛత్రపతి గొప్ప పోరాట యోధుడని, ప్రజా సంక్షేమానికి పాటుపడిన మహనీయుడని కొనియాడారు. యువతరానికి ఆయన స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారని తెలిపారు.

ఆదర్శంగా తీసుకోవాలి

కుల్కచర్ల: శివాజీని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కరణం ప్రహ్లాద రావు సూచించారు. మండల పరిధి పుట్టపహాడ్ గ్రామంలో యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఇందులో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, వైస్ ఎంపీపీ రాజశేఖర్ గౌడ్, ప్రముఖ వక్త, ఆధ్యాత్మిక వేత్త భాస్కరయోగి, నాయకులు రాజు, రాజప్ప, హరికృష్ణ, వీరారెడ్డి, బోయిని అంజిలయ్య, గోపాల్, శ్రీనివాసులు, తిరుపతయ్య, మహేశ్వర్ రెడ్డి, చిన్నరాజు, కేశవులు, వెంకటేశ్వర్ గౌడ్, రమేషాచార్యులు, మాలె కృష్ణయ్య, శేఖర్ గౌడ్, నాయకులు ఉన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: ఛత్రపతిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ మహిపాల్ అన్నారు. మండల పరిధి చల్లాపూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. యువత ఐకమత్యంతో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇందులో వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు తదితరులున్నారు.



యాలాల: చెన్నారం విగ్రహావిష్కరణలో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



నవాబుపేటలో శివాజీ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న యువకులు



కుల్కచర్ల: జయంతిలో మాట్లాడుతున్న భాస్కరయోగి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల



కుల్కచర్లలో శివాజీ విగ్రహ ఆవిష్కరణ



దౌల్తాబాద్‌లో..



బంట్వారంలో..



దోమ: బొంపల్లిలో..



దోమ: ఐనాపూర్‌లో..



తాండూరు రూరల్: చెంగోల్‌లో..



కొడంగల్ రూరల్: శివాజీ విగ్రహానికి పూజలు చేస్తున్న డాక్టర్ రవీంద్రయాదవ్



వికారాబాద్: గొట్టిముక్కలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



వికారాబాద్: మద్గుల్‌చిట్టంపల్లిలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్

నేడు కమాన్ ప్రారంభం

ధారూరు: మండల కేంద్రంలోని తాండూరు–హైదరాబాద్ ప్రధాన మార్గం పక్కన నూతనంగా నిర్మించిన వీరభద్రేశ్వరస్వామి కమాన్, బసవేశ్వరస్వామి విగ్రహాన్ని మంగళవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. అదే విధంగా ధారూరులో వివేకానందస్వామి విగ్రహం, నూతనంగా ఏర్పాటు చేయనున్న ఓ ప్రైవేటు ఆసుపత్రిని స్పీకర్ ప్రారంభించనున్నారు.

సీఎం సభకు తరలి రావాలి

- ఆనందంలో పార్టీ శ్రేణులు
- అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్న రేవంత్
- ఘనస్వాగతం పలికేందుకు సన్నాహాలు

బొంరాస్‌పేట: సీఎం పర్యటన నేపథ్యంలో పార్టీ శ్రేణులు ఫుల్ జోష్‌గా ఉన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం తొలిసారిగా నియోజకవర్గం గడ్డకు రానుండగా.. ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు కాంగ్రెస్ నాయకులు సిద్ధమవుతున్నారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల అనంతరం నిర్వహించే బహిరంగ సభకు ప్రజలు తరలి రావాలని ఆ పార్టీ దుద్యాల, బొంరాస్‌పేట మండలాల నేతలు నర్సింహులుగౌడ్, ఆవుటి శేఖరయ్య పిలుపునిచ్చారు.

అభివృద్ధి పనులు ఇవే..

రూ.2,945కోట్లతో నిర్మించనున్న కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకం, రూ.360కోట్లతో ప్రభుత్వ వెటర్నరీ కళాశాల, రూ.344.5కోట్లతో డబుల్ రోడ్లు, వంతెనలు, రూ.224.50కోట్లతో మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ కళాశాలలు, కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రి 220బెడ్లు, టీచింగ్ కళాశాల, రూ.213.20కోట్లతో పీఆర్ రోడ్లు, రూ.40 కోట్లతో ఉపాధిహామీ, సీసీరోడ్లు, రూ.30కోట్లతో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, రూ.27.86కోట్లతో గిరిజన సంక్షేమశాఖ బీటీరోడ్లు, రూ.14.26కోట్లతో బొంరాస్‌పేట, దౌల్తాబాద్ జూనియర్ కళాశాలల ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా కోస్గి పట్టణ కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సీఎం.. శంకుస్థాపనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మహిళా సంఘాలతో సమావేశం, భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు రాజేశ్‌రెడ్డి, వెంకట్రాములుగౌడ్, మల్లికార్జున్, మేర్గు వెంకటయ్య, అంజిల్‌రెడ్డి, సంతోష్‌కుమార్, ఖాజా ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్



సాజిదాబేగం

ధారూరు: తహసీల్దార్‌గా సాజిదాబేగం సోమవారం బాధ్యతలు చేపట్టారు. సెక్రటేరియట్‌లో ఇరిగేషన్, కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ శాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆమెను, శిక్షణ తహసీల్దార్‌గా నియమించారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ భువనేశ్వర్, సీసీఎల్‌ఏలో పనిచేసి తహసీల్దార్‌గా శిక్షణ కోసం ధారూరు వచ్చి, మళ్లీ అక్కడికే వెళ్లారు.

గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు

పూడూరు: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి కండ్లపల్లి, బాకాపూర్, మాటుగుడ, గట్టుపల్లి, మంచన్‌పల్లిలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అవసరం ఉన్నచోట్ల సీసీరోడ్లు వేయిస్తున్నామని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు పెంటయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, బాలమణి ఉన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత ఉండాలి

- గ్రామస్తుల సహకారంతోనే అభివృద్ధి
- ప్రత్యేక అధికారులు

మర్పల్లి: ఉపాధిహామీ నిధులు రూ.10 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని ప్రత్యేక అధికారి, తహసీల్దార్ గణేశ్ కాంట్రాక్టర్‌కు సూచించారు. మండల పరిధి సిరిపురం గ్రామంలో సోమవారం హనుమాన్ మందిరం నుంచి గుండుబాయి వరకు, బైండ్ల గంద్యమ్మ ఇంటి నుంచి నిమ్మగల్ల కృష్ణ ఇంటి వరకు, దొడ్లె సుధాకర్ ఇంటి నుంచి బైపాస్ రోడ్డు వరకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను తహసీల్దార్ పరిశీలించారు. రోడ్డు పనులను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. సీసీ నిర్మాణం అనంతరం క్యూరింగ్ కోసం కట్టలు కట్టి, నీటిని నింపాలని చెప్పారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి నాగయ్య, కాంట్రాక్టర్ మర్రి లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

చింతమణిపట్నంలో..

తాండూరు రూరల్: ప్రజల సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని చింతమణిపట్నం ప్రత్యేక అధికారి, ఎంఈఓ వెంకటయ్య అన్నారు. గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.



మోమిన్‌పేట: సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సుభాష్ తదితరులు

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని నిర్మాణదారుడికి సూచించారు. ప్రజలందరూ సమష్టిగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి రవి, నాయకులు రాము యాదవ్, రమేష్, యాదు, బాలకృష్ణ, నర్సింహులు గౌడ్, లక్ష్మీకాంత్‌రెడ్డి ఉన్నారు.

ఇజ్రాచిట్టంపల్లిలో..

మోమిన్‌పేట: మండల పరిధి ఇజ్రాచిట్టంపల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ గ్రామ సీనియర్ నాయకుడు సుభాష్ తెలిపారు. ఇందులో నాయకులు రవీందర్, రాజసింగ్, రాజు, మోహన్, రామ్, హరి, ప్రవీణ్, విజయ్ తదితరులు ఉన్నారు.

సమన్వయంతోనే పల్లెల్లో ప్రగతి

- వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలి
- కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి

బంట్వారం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పని చేస్తేనే గ్రామాల్లో ప్రగతి సాధ్యమని కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవికాలం నేపథ్యంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. పైప్‌లైన్ల లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించి, నీటి వృథాను అరికట్టాలని కోరారు. ఆర్‌అండ్‌బీ అధికారుల పని తీరు అధ్వానంగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం ఏఈ స్థాయి అధికారి కూడా సభకు హాజరు కాకపోవడం ఏంటని ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారుల జాబితాను శాఖలు వారీగా సిద్ధం చేస్తామని చెప్పారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు శాఖల వారీగా అధికారులు ఎజెండాలోని అంశాలను సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రాజేశ్వర్ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ డానియల్, హార్టికల్చర్ క్లస్టర్ ఆఫీసర్ కమల, ట్రాన్స్‌కో ఏఈ పావని, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణు మాధవ్, హెల్త్ సూపర్‌వైజర్ రవీందర్‌రెడ్డి, వెటర్నరీ డాక్టర్ మధన్ మోహన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

వేరుశనగ రైతుల వెతలు

పల్లి రైతులకు పొట్టే మిగులుతోంది. సాగు చేశామన్న తృప్తి తప్పితే.. పెట్టుబడులు కూడా దక్కడం లేదు. దిగుబడి సంగతి ఎలా ఉన్నా.. పంటను విక్రయించేందుకు విపణి లేదు. మార్కెట్లో మద్దతు ధర లేనే లేదు. గింజలను అమ్ముకోవాలంటే దళారులే దిక్కు. ఇన్నికష్టనష్టాల కోర్చి.. కూడబెట్టుకున్నదేమీ కానరాక.. చివరకు రైతు కాడి వదిలేసే దుస్థితి కనబడుతోంది.

తగ్గిన దిగుబడి, పెరగని మార్కెట్ రేటు

- మద్దతు ధర అంతంతే
- విక్రయించేందుకు మార్కెట్ లేదు
- దళారుల దోపిడీకి అడ్డుకట్టలేదు



నూర్పిడి చేస్తున్న రైతులు

బొంరాస్‌పేట: జిల్లాలో వేరుశనగ సాగు బాగానే ఉన్నా.. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. యాసంగిలో 19వేల ఎకరాల్లో పల్లి సాగయినట్లు సమాచారం. అయితే తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ వ్యవసాయ మార్కెట్, ధారూరు, మర్పల్లి, తదితర మండల కేంద్రాల్లో ఏఎంసీలున్నా.. రెండేళ్లుగా పల్లిని కొనుగోలు చేయడం లేదన్నట్లు సమాచారం. దీనికి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర క్వింటాల్‌కు కేవలం రూ.5,300 ఉండటమే కారణమన్నట్లు తెలుస్తోంది. దీంతో కొందరు రైతులు బహిరంగ మార్కెట్లో దళారులకు విక్రయిస్తున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

తగ్గిన దిగుబడి

గత అక్టోబర్ సీజన్‌లో వేసిన వేరుశనగ పంట చేతికొచ్చింది. కానీ దిగుబడి తగ్గింది. గతంలో ఎకరాకు (30కిలోల బస్తాలు)26 బస్తాల వరకు దిగుబడి రాగా, ప్రస్తుతం 18 బస్తాలే వచ్చాయి. సాగుబడిలో కుటుంబం మొత్త చెమటోడ్చినప్పటికీ.. ఎకరాకు రూ.24వేలు పెట్టుబడి అయింది. బయటి కూలీలతో పనిచేయిస్తే అది మరింత పెరిగేది. అయినప్పటికీ.. దిగుబడి తగ్గడంతో పల్లి రైతులు పెదవి విరుస్తున్నారు.

ధరలో కోత, తూకంలో మోసం

'ఇల్లు అమ్మి పేలాలు తిన్నట్లు' ఉంది పల్లిరైతు పరిస్థితి. చేతికొచ్చిన పంటను.. ప్రభుత్వ పరంగా మద్దతు ధర సరిగాలేక, కొనుగోళ్లు లేకపోవడంతో మధ్యవర్తులు, దళారులు రాజ్యమేలుతున్నట్లు రైతులు వాపోతున్నారు. వీరికి పంట విక్రయించేందుకు రైతులు మక్కువ చూపకపోయినా.. కల్లాల వద్దే గద్దల్లా వాలుతురు. మోసపూరిత మాటలతో దిగుబడిని దక్కించుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. తీరా పంట ఇవ్వడానికి మట్టిబిడ్డ మొగ్గుచూపగా.. మద్దతు ధరలో కోత, తూకంలో మోసం చేస్తూ.. నిట్టనిలువునా ముంచుతున్నట్లు ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. దళారులకు మద్దతుగా మోతుబరి రైతులు.. కొందరు పెద్దమనిషి పాత్ర పోషిస్తుండటంతో.. చిన్న సన్నకారు రైతులు వారి మాటను జవదాటలేక పోతున్నట్లు సమాచారం.

క్వింటాకు 4.5 కిలోలు అదనం

దిగుబడి, మద్దతు ధర ఆశాజనకంగా లేకపోవడంతో, పల్లీ సాగుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. బీడుగా వదిలేయలేక కౌలుకు ఇస్తున్నారు. అయితే.. వారు చేతులెత్తేసే దుస్థితి కనబడుతోంది. మార్కెట్, కొనుగోలు కేంద్రాలు అందుబాటులేక.. వచ్చిన ధరకు పంటను దళారులకు విక్రయిస్తున్నారు. ఇదిలా ఉండగా.. బస్తాకు 1.5 కిలోల చొప్పున క్వింటాలుకు 4.5 కిలోలు అంటే సుమారు రూ.250వరకు దోస్తున్నారు. అధికారులు స్పందించి మార్కెట్ ధరకు పల్లిని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

నిరాశే మిగిల్చింది



వేరుశనగ యాసంగి(రబీ) సాగుపైనే ఆశ ఉండేది. యేటా చుట్టు పక్కల రైతుల పొలాలను కౌలుకు తీసుకొని పల్లి పంట వేస్తుంటాను. గతేడాది ఐదెకరాల్లో సాగుచేశాను. దిగుబడి తగ్గి, నిరాశే మిగిల్చింది. మార్కెట్ అందుబాటులో లేక, దళారులతో మోసపోయాను.

– హన్మంతు, రైతు లింగన్‌పల్లి

మద్దతు ధర పెంచాలి



పల్లి క్వింటాకు రూ.5వేలకు పైగా ఉంది. ప్రభుత్వం మద్దతు ధర పెంచితే బాగుండు. కొనుగోలు కేంద్రాలు లేవు. ఇష్టం లేకపోయినా దళారులకు పంటను విక్రయించాల్సి వస్తుంది. క్వింటాకు 4.5 కిలోల చొప్పున కమీషన్ పేరుతో కోత పెడుతున్నారు. దీనిపై అధికారులు స్పందించాలి.

– భీంరెడ్డి, రైతు, కొత్తూరు

ఏఎంసీల్లో కొనుగోళ్లు



పట్టణ కేంద్రాలు, ఏఎంసీల్లో వేరుశనగ కొనుగోళ్లు జరుగుతున్నట్లు సమాచారం. పంట పండించే మండల పరిధిలో కొనుగోలు చేసే అవకాశం ఉంది. బయట ధర ఎక్కువగా ఉండటంతో రైతులు మార్కెట్లకు వెళ్లకుండా.. వారికే పంటను విక్రయిస్తున్నారు.

– గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి